నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: మరమ్మతుల కారణంగా మారుతీ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సికింద్రాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మారుతీనగర్ రోడ్ నంబర్ 1 నుంచి 6, వరకు, ఈఎంఈ సిగ్నల్ పరిసర ప్రాంతాలు, అలాగే తుర్కపల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మా సంతోషి కాలనీ, తుర్కపల్లి విలేజ్, కళాసీగూడ, బ్లూబర్స్ కాలనీ, రైల్వేకాలనీ, వీబీ సిటీ , ఏఆర్‌కే హోమ్స్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 21, క్యాప్సికం 33, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 40, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 20, చామగడ్డ 45, మొరంగడ్డ 40, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

విజయ్‌కుమార్‌కు డాక్టరేట్


పరిశోధనా పత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ విభాగంలో తోకల విజయ్‌కుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సికింద్రాబాద్ పీజీ కాలేజీలో పార్టుటైం అధ్యాపకుడిగా పని చేస్తున్న ఆయన ఓయూ చీఫ్ వార్డెన్ ప్రొ.కొర్రెముల శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ కస్టమర్ పర్సీవ్డ్ రిస్క్ అండ్ రివార్డ్ ఆన్ యూజ్ ఆఫ్ డిజిటల్ బ్యాంకింగ్ ఇన్ సెలెక్ట్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కురుచపల్లి గ్రామానికి చెందిన తోకల విజయ్‌కుమార్ గ్రామం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకున్న మొదటి విద్యార్థి. తన పరిశోధనకు సహకరించిన అధ్యాపకులు, మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేల పునాదుల్లోనే చరిత్ర


ప్రొఫెసర్ శ్రీనివాస్‌ను సన్మానించిన అధ్యాపకులు

సనత్‌నగర్: చరిత్ర అంటే ఎక్కడో లేదని, మనం నిలబడిన నేల పునాదుల్లోనే ఉందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ శ్రీనివాస్ అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిస్టరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'తెలంగాణ చారిత్రక మూలలు'పై మంగళవారం నిర్వహించిన విశ్లేషణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో చరిత్ర ఒక జీవన విధానమన్నారు. ప్రతిఒక్కరూ చరిత్రను తెలుసుకోవడమే ద్వారానే భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. తెలంగాణలో జరిగిన తవ్వకాల్లో లభించిన బ్రాహ్మీ పదాల ద్వారా బుద్ధుడి కాలంలోనే బౌద్ధం తెలంగాణలో వ్యాపించిందని వివరించారు. కార్యక్రమంలో చరిత్ర విభాగం అధ్యాపకులు సంధ్యజ్యోత్స్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణప్రియ, స్నేహ, డాక్టర్ నరసింహులు, భాస్కర్‌రెడ్డి, విజయ రాఘవ, కమల, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించేలా కోదండరాం వ్యాఖ్యలు

దక్షిణాది జేఏసీ చైర్మన్
ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను కాకుండా అడ్డుకుంటామని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం ప్రకటించడం అంబేడ్కర్‌ను అవమానించడమే అవుతుందని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. తార్నాకలోని తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కంటే హైదరాబాద్ దేశానికి రెండో రాజధాని అయితే 100 రెట్లు అధికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయంలో తాను బహిరంగ చర్చకు సిద్ధమని, ఎమ్మెల్సీ కోదండరాం స్వీకరించాలని సవాలు చేశారు. సమావేశంలో జేఏసీ కో చైర్మన్లు సుంకే సంపత్, శంకర్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

- 26 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు

సనత్‌నగర్: నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కేంద్రాల్లో తాగునీరు, బెంచీలు, ఇతర సౌకర్యాలను సిద్ధం చేశారు. వేసవి దృష్ట్యా విద్యార్థులు అస్వస్థతకు గురైతే చికిత్స అందించేందుకు సెంటర్ల వద్దే వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నది. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సిట్టింగ్ బృందాలను సిద్ధం చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఇప్పటికే ఐదుగురితో హైపర్ కమిటీని నియమించారు. విధులు నిర్వర్తించే సిబ్బంది సైతం సెంటర్లలోకి సెల్‌ఫోన్లను తీసుకెళ్లొద్దని, అలాగే పరీక్ష జరిగే సమయంలో కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు అందాయి.

నిఘా నీడలో పరీక్షా సెంటర్లు..

సనత్‌నగర్, ఎస్సార్‌నగర్, బేగంపేట, రాంగోపాల్‌పేట, మార్కెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 26 సెంటర్లలో పరీక్షలు జరగనున్నాయి. అత్యధికంగా ఎస్సార్‌నగర్ పీఎస్ పరిధిలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని సెంటర్ల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటికే కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. దీనిద్వారా పరీక్షల నిర్వహణ తీరును అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. 500 మంది విద్యార్థులు ఉన్న సెంటర్‌లో ఇద్దరు చొప్పున పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.


హాల్ టికెట్లు నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

పోలీస్‌స్టేషన్ వారీగా సెంటర్లు	
ఎస్సార్‌నగర్	20
బేగంపేట	1
రాంగోపాల్‌పేట	2
మార్కెట్	3
సనత్‌నగర్	0

ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి..

పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరగనున్నాయి. విద్యార్థులను ఉదయం 8.15 నుంచి హాల్‌లోకి అనుమతిస్తారు. 8.45 నుంచి 9 గంటల వరకు వచ్చే విద్యార్థుల ఆలస్యానికి గల కారణాలపై ఆరా తీసి లోనికి అనుమతించనున్నారు.

ట్రాఫిక్ పోలీసుల సహకారం..

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయంలో చేరుకునేలా ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉండనున్నారు. సెంటర్ల చిరునామా విషయంలో విద్యార్థులు గందరగోళానికి గురైతే వారికి దిశానిర్దేశం చేసేందుకు పోలీసులు ఉండనున్నారు. ఎప్పటిలాగానే ట్రాఫిక్ సిబ్బంది విద్యార్థులకు పూలు అందించి మంచిగా పరీక్షలు రాయాలని విషెస్ చెప్పి లోనికి పంపించేందుకు సెంటర్ల వద్ద సిబ్బంది రెడీగా ఉండనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


వార్షికోత్సవంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు

కంటోన్మెంట్: ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందుతుందని మారేడుపల్లి మండల విద్యాధికారి మదన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈస్ట్ మారేడుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని, అదే సమయంలో బోధనా ప్రమాణాలను మరింత మెరుగుపరిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ వార్షికోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగ లీలావతి, ఉపాధ్యాయులు సీహెచ్ విజయలక్ష్మి, అరుణ, మంగమ్మ, మంజుల, జయమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్‌తో పాటు సికింద్రాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఇటీవల వచ్చిన కవిత తార్నాకలోని డిప్యూటీ మేయర్ నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో డివిజినల్ ఇంజినీరు సువర్ణ, అసిస్టెంట్ ఇంజినీరు వేణు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


గురుమూర్తిలేన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ టి.మహేశ్వరి

సనత్‌నగర్: అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని గురుమూర్తిలేన్‌లో జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు చేపట్టలేదని వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అలాగే సీసీ రోడ్లు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేవని, ప్రస్తుతం గతంలో మంజూరైన పనులే ఇంకా జరగడం లేదని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత శ్రీహరితో పాటు జీహెచ్ఎంసీ ఏడీఈ, ఏఈ, జలమండలి మేనేజర్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) 5వ రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆవిష్కరించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొర్రెల్లి సురేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈనెల 15న కాన్షీరాం జయంతి సందర్భంగా తలపెట్టిన బీఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు రాములు, మల్లేశం, సుందర్, రహీం, ప్రసాద్, శివ, శ్రీశైలం, శ్రీకాంత్, సాయిలు, ఉదయ్, రమేశ్, మోహన్ పాల్గొన్నారు.

తెలంగాణలో అధికారంలోకి రానున్నది బీజేపీనే


విజయోత్సవ వేడుకల్లో బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌గౌడ్, సారంగపాణి


ఉపాధ్యాయులకు స్వీట్లు పంచిపెడుతున్న వెల్లాల రామ్మోహన్

సికింద్రాబాద్: తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందడంపై సీతాఫల్‌మండి కూడలిలో సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కందాడి నాగేశ్వర్‌రెడ్డి, చామల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, రవిప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నేత ఆధ్వర్యంలో..

సనత్‌నగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కొమురయ్య విజయం సాధించడంపై బీజేపీ శ్రేణులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో స్థానిక రోజ్‌బడ్స్‌హైస్కూల్‌లో టీచర్లకు స్వీట్లు పంపిణీ చేశారు.

రైలు ఢీకొని విద్యార్థి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని విద్యార్థి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన విజయ్‌పాల్ శుక్లా ఆర్మీ ఉద్యోగి. అల్వాల్‌లో నివాసం ఉంటున్న విజయపాల్ శుక్లా కుమారుడు సచిన్‌శుక్లా (17) ఇంటర్ చదువుతున్నాడు. మంగళవారం ఉదయం కాలేజీకి వెళ్లిన సచిన్‌శుక్లాను అల్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలో కాచిగూడ ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైల్లో రాజస్థాన్ వాసి..

సికింద్రాబాద్: రైల్లో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హిస్సార్–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌కు చేరుకున్న సమయంలో బోగీ టాయ్‌లెట్‌లో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పరిశీలించగా మృతుడు రాజస్థాన్ రాష్ట్రం బీరాచోటి నాక్ గ్రామానికి చెందిన మూలారామ్ (65)గా గుర్తించారు. సోమవారం మార్వాడి జంక్షన్ నుంచి బయలుదేరిన మూలారామ్ అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కళా సిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనకు అనూహ్య స్పందన


మేళాలో కొనుగోలు చేస్తున్న మహిళలు

లాలాపేట: హబ్సిగూడలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత, హస్తకళా వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరెలు, బెడ్ షీట్స్, వెస్ట్ బెంగాల్ జాంధాన్ని చీరెలు, రాజస్థాన్ కోటా శారీస్, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం శారీస్, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చికెన్ వర్క్ కుర్తీస్, తీరొక్క వస్త్రాలు, కాటన్ దుస్తులతో పాటు పాటు 1 గ్రామ్ గోల్డ్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి. చేనేత కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే కళా సిల్క్ చేనేత వస్త్ర, హస్తకళా ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 10 వరకు కొనసాగుతుందని, ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనీ ఆయన సూచించారు.

విద్యార్థిని అదృశ్యం


నిక్షిత

చిలకలగూడ: విద్యార్థిని అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి మైలార్‌గడ్డకు చెందిన నిక్షిత (21) నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. గతనెల 25న కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అదేరోజు రాత్రి 7.30 గంటలకు సోదరుడు ఫోన్ చేయగా స్నేహితులతో కలిసి పుట్టినరోజు ఫంక్షన్‌కు ఘట్‌కేసర్‌కు వచ్చానని చెప్పింది. లొకేషన్ పెడితే వచ్చి పికప్ చేసుకుంటానని చెప్పాడు. తర్వాత కాల్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అప్పటి నుంచి పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి సైదయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోర్లకు మరమ్మతు చేపట్టాలి



లాలాపేట: తార్నాక మున్సిపల్‌లో నిరుపయోగంగా మారిన పవర్ బోర్లు, చేతిపంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లాలాపేట, లక్ష్మీనగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో పాడైన పవర్ బోర్, చేతి పంపులను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవిలో నీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలనీ కోరారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్, స్థానికుడు సురేశ్ యాదవ్, హ్యాండ్ పంపు విభాగం సిబ్బంది పాపయ్య, లతీఫ్ తదితరులు ఉన్నారు.

సాధారణ ప్రయాణాల్లో సైరన్ వినియోగిస్తే చర్యలు

సికింద్రాబాద్: సాధారణ ప్రయాణాలు చేసే సందర్భాల్లో సైరన్ వినియోగించే అంబులెన్స్ డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు హెచ్చరించారు. సికింద్రాబాద్–తార్నాక ప్రధాన రహదారిలో అంబులెన్స్ వాహనాల రాకపోకలపై మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను తీసుకురావడం, వాహనంలో పేషెంట్ పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నప్పుడు మాత్రమే డ్రైవర్లు సైరన్లు వినియోగించాలన్నారు. పలువురు డ్రైవర్లు సాధారణ ప్రయాణాల్లోనూ సైరన్ వినియోగిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అసలే ట్రాఫిక్ సమస్యలు ఉంటున్న రహదారులపై డ్రైవర్లు సమస్యలు సృష్టించకుండా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


వెస్ట్ మారేడుపల్లిలో డ్రైనేజీ లీకేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: వెస్ట్‌మారేడుపల్లి ప్రధాన రహదారిపై డ్రైనేజీ లీకేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. 15 రోజులుగా ప్రధాన రహదారిపై మురుగు నీరు లీకై దుర్వాసన వస్తుండడంతో స్థానిక వ్యాపారులు, సుమన్ కాలనీవాసులు ధర్నా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ డీజీఎం విద్యాసాగర్‌తో కలిసి సుమన్ కాలనీని సందర్శించారు. రోడ్డు పడమర వైపు కంటోన్మెంట్, ఉత్తరం వైపు జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తుందని, అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే సమస్య రోజురోజుకు జఠిలం అవుతున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కంటోన్మెంట్ అధికారులకు సూచించారు. అలాగే శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. తమ సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

విజయ్‌నగర్ బస్తీలో పర్యటన

సుమన్‌కాలనీలో ఎమ్మెల్యే పర్యటనలో విజయ్‌నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిశారు. తమ కాలనీలోనూ తాగునీటి పైప్‌లైన్‌లో డ్రైనేజీ నీరు కలుస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విజయ్‌నగర కాలనీలో పర్యటించి, అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అంతర్జాతీయ మహిళ, ఒబెసిటి డే వేడుకలు


బీజేపీ నాయకురాలు లక్ష్మికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: తార్నాకలోని కందర్ డయాబెటిస్ సెంటర్‌లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, వరల్డ్ ఒబెసిటి డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అపోలో హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ హరికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదిశక్తి రూపంలో మహిళలను గౌరవించడం మన దేశ సంస్కృతి అన్నారు. కేవలం ఒక రోజు గౌరవించడమే కాకుండా నిత్యం మహిళలకు అన్ని రంగాల్లో సముచితమైన గౌరవం దక్కాలన్నారు.అలాగే దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో ఒబెసిటి ఒకటిగా ఉందన్నారు. క్రమబద్ధమైన ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా దీన్ని అధిగమించవచ్చన్నారు. అలాగే ఒబెసిటీపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలకు జ్ఞాపికలను అందించి ఘనంగా సత్కరించారు. కందర్ డయబెటిస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె. దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్‌గౌడ్, రాము వర్మ, డాక్టర్ కేశవ్, వాసవి, డా అనూష, గ్రీష్మ తదితరులు ఉన్నారు.

15న మేధావులతో తొలి సమావేశం


ప్రొ.ప్రభంజన్ యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజనుల రాజ్యాధికారం కోసం బీసీల సారథ్యంలో కొత్త పార్టీని స్థాపించనున్నట్లు సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొ.ప్రభంజన్ యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న కాన్షీరాం జయంతిని పురస్కరించుకొని 101 మంది మేధావులు, విద్యార్థి నాయకులు, ఉద్యమకారులతో రవీంద్ర భారతీ సమీపంలో గల డిక్కీ కార్యాలయంలో తొలి సమావేశాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ఓటు చైతన్యంతో బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా ఏర్పాటు కాకున్న నూతన పార్టీపై విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జన్‌ఔషధి కేంద్రాల్లో తక్కువ ధరకే మందులు



కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు

రసూల్‌పురా: ప్రధానమంత్రి భారతీయ జన్‌ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందిస్తున్నామని రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి అన్నారు. తిరుమలగిరిలో బీజేపీ నాయకుడు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో 'జన్‌ఔషధి ఏక్ కదం మాతృశక్తికి ఓర్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు సువిధా శానిటరీ ప్యాడ్స్, జన్ ఔషధి కప్పులు, ఇతర ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సామాజిక సేవకుడు గోపు రమణా రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా వివిధ ఉత్పత్తులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మీనాక్షి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటర్ హ్యాండీకాఫ్ట్ వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఓయూలో చంద్రారెడ్డి వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ నాయకుడు షహీద్ మేరెడ్డి చంద్రారెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రారెడ్డి స్ఫూర్తితో విద్యార్థులు, యువత జాతీయ భావం, దేశ భక్తితో పని చేయాలని ఏబీవీపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పగిడిపల్లి శ్రీహరి, ధృహన్, శివశంకర్, పృధ్వీతేజ, రాజు, కమల్ సురేశ్, హరిప్రసాద్, కల్యాణ్, శేఖర్, శ్రీధర్, చిరంజీవి, కోటేశ్వర్, శ్రీకర్, హరిచందన్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు